ప్రియమైన స్నేహితుడా, మనం ఆయన చేత మరియు ఆయన కోసం సృష్టించబడ్డాము. యేసు లేకుండా మనం సమాధానంతో జీవించలేము. ఈ పాప లోకంలో పూర్తిగా లీనమైపోయిన తరువాత ఒక యువకుడు నెమ్మదిలేని హృదయంతో క్రీస్తు వద్దకొచ్చి, తన జీవితాన్ని ఆయనకు సమర్పించి, సంతోషంతో ఇలా చెప్పాడు: “ఓ ప్రభువా, నీకోసం నీవు మమ్మల్ని సృష్టించావు. నీలో మా హృదయాలు విశ్రాంతిని పొందేంత వరకు వాటికి విశ్రాంతి లేదు.”

నీవు అసంతృప్తితో రగులుతూ ‘మరేదో ఎక్కువదాని కోసం’ ఆపేక్షిస్తూ పోరాడుతున్నావా? దేనిని వెదుకుతున్నావో తెలియకుండానే దానిని వెదుకుతున్నావా? అదేమిటో నీవు వ్యక్తపరచలేకపోవచ్చు కాని దానిని అణిచివేయలేవు కూడా. నీళ్ళలో నుండి తీయబడిన చేపలా ఉన్నావా? యేసు క్రీస్తుకు వేరుగా నీవు వెదికి అనుభవించే మిగతావేవి కూడ నీ హృదయ తృష్ణను ఎన్నడూ తీర్చలేవు.

“ప్రయాసపడి భారము మోసికొనుచున్న సమస్త జనులారా, నా యొద్దకు రండి; నేను మీకు విశ్రాంతి కలుగజేతును” (మత్తయి 11:28) అని చెప్పిన యేసు దప్పిగొనియున్న నీ ఒంటరి హృదయానికి చాలా అవసరము. నీ పాపములు మరియు ఒంటరితనం నుండి నిన్ను రక్షించగల ఏకైక రక్షకుడు ఆయనే. పశ్చాత్తాపముతో యేసు వద్దకు వచ్చి నీ హృదయం విశ్రాంతితో నింపబడులాగున ఆయన మాత్రమే ఇచ్చే నిజమైన ప్రేమ, సంతోషాలను పొందుకుంటావా?

SPACE FOR CONTACT :



మానవ చరిత్రలో మునుపెన్నడూ లేనంతగా నేడు ప్రజలు విశ్రాంతి లేని తమ హృదయ దాహమును తీర్చుకోవడానికి అనునిత్యం అన్వేషణలో కొనసాగుతున్నారు. నేడు ప్రజలలో చింత, చికాకు విపరీతముగా వున్నాయని నివేదికలు చెబుతున్నాయి. ఈ పోరాటమును కలుగజేసే మూలకారణం ఒంటరితనం.

"ప్రేమించబడలేదనే భావన మరియు ఒంటరితనం అనేవి అతి భయంకరమైన బీదరికం," అని మదర్ థెరిసా చెప్పారు. వేగంగా అభివృద్ధి చెందే తీరికలేని ఈ లోకంలో ప్రజలు ఒంటరితనంతో పోరాడటమనేది ఆశ్చర్యమైనదేమి కాదు.

స్నేహితుడా, ఒంటరితనంతో పోరాడుతున్న ప్రజలలో నీవు కూడ ఉన్నావా? బయట సంతోషంగా కనబడవచ్చును కాని అంతరంగములో నీవు ఒంటరిగా మరియు నెమ్మది లేక ఉన్నావా?

కుటుంబం, స్నేహితులు, డబ్బు, ఉద్యోగం, ఆటలు, సినిమాలు, విద్యార్హతలు, మొ॥ విషయాలు, తాత్కాలిక సుఖాన్ని మాత్రమే సమకూర్చి మళ్ళీ నిన్ను ఒంటరితనంలోకి నెట్టివేస్తాయని బహుశా నీకు తెలిసేవుంటుంది. వినోదాలకు పూర్తి అవకాశాలు కలిగిన లోకంలో నీవు అన్వేషించి పొందుకున్న ఎలాంటి సుఖమైనా వెంటనే కనుమరుగైపోయి నిన్ను మళ్ళీ దాహానికి గురిచేస్తాయి.

నీ గొప్ప అనుభూతులన్ని కేవలము క్షణికమైతే, నిజమైన మరియు శాశ్వతమైన సంతృప్తి అనేది ఉందా? అవును, ఉందని చెప్పడానికి నేను ఆనందిస్తున్నాను. సంపూర్ణమైన సంతోషాన్ని కనుక్కోవడానికి ఒకే ఒక మార్గం ఉంది.

"ఎవడైనను దప్పిగొనిన యెడల నా యొద్దకు వచ్చి దప్పి తీర్చుకొనవలెను" (యోహాను 7:37) అని కనికరంతో యేసు చెప్పాడు. యేసు క్రీస్తు యొద్దకు వచ్చువాడు సంపూర్ణ సంతోషంతో, జీవంతో, సంతృప్తితో నింపబడుతాడు (యోహాను 10:10).

కాని, యేసు వద్దకు ఎందుకు రావాలి? ఆయన భూమిని మరియు ఆకాశమును సృష్టించెను. ఆయనే సమస్త మానవాళికి సృష్టికర్త. "సర్వమును ఆయనయందు సృజింపబడెను, సర్వమును ఆయనద్వారాను ఆయననుబట్టియు సృజింపబడెను" (కొలస్సీ. 1:16) అని పరిశుద్ధ బైబిలు చెబుతుంది.

విచారకరంగా, పాపం మానవున్ని దేవుని నుండి వేరు చేసింది. "మనమందరము గొఱ్ఱెల వలె త్రోవ తప్పిపోతిమి. మనలో ప్రతివాడును తనకిష్టమైన త్రోవకు తొలిగెను" (యెషయా 53:6).

ఫలితంగా దప్పిగొనిన వ్యక్తి ఉప్పు నీటితో తన దాహాన్ని తీర్చుకోవడానికి ప్రయత్నించినట్లే, మనము లోక విషయాలతో మరియు మనిషి కల్పించిన ఆచారాలతో మన దాహాన్ని తీర్చుకోవడానికి ప్రయత్నించినా, పూర్తిగా నిరీక్షణలేని స్థితిలో మనము దప్పికతోనే విడువబడ్డాము.

అయినప్పటికి దేవుడు మనల్ని నిరీక్షణ లేకుండా వదిలేయలేదు. మన పట్లున్న ప్రేమ మూలంగా ఆయన మానవునిగా వచ్చి మన పాపాల కోసం శ్రమపడి, తన ప్రశస్తమైన రక్తాన్ని చిందించి, సిలువ మీద తన ప్రాణాన్ని అర్పించాడు.

కాని ఆ తరువాత అద్భుతమైన సంఘటన చోటు చేసుకొంది. మూడవ రోజున క్రీస్తు తిరిగి లేచి తన్ను తాను సర్వ లోకానికి రక్షకునిగా, ప్రభువుగా నిరూపించుకొన్నాడు.

పాప క్షమాపణ కోసం తన వద్దకొచ్చే వారందరికి యేసు క్రీస్తు నిత్య జీవాన్ని, ప్రేమను, సంతోషాన్ని, భద్రతను, సమాధానాన్ని అనుగ్రహిస్తాడు. ఆయన నిన్ను ప్రేమిస్తున్నాడు. ఆయన నీ గురించి పట్టించుకొంటున్నాడు. నీకు అవసరమైనది ఆయనే. నలిగిన అనేక జీవితాలను ఆయన బాగు చేశాడు. నలిగిన నీ హృదయాన్ని కూడా ఆయన బాగు చేయగలడు.